భాగ్యశాలిని

1

"అమ్మా! ధర్మం తల్లీ!"

శ్రావస్తీనగరంలో రత్నవర్ధన శ్రేష్ఠి భవంతి ప్రాంగణంలో నిలబడిన ఒక బిచ్చగత్తె అలాగే రెండు మూడు మారులు గొంతెత్తి పిలిచింది.

"భోజనాలవేళ ఇప్పుడు బిచ్చం వెయ్యడానికి వీలులేదు పో!"

గట్టిగా కసిరికొట్టాడు భవంతి వీథిగుమ్మంలో నిలబడిన ద్వారపాలకుడు.

నిజానికప్పటికే రత్నవర్ధన శ్రేష్ఠి భవంతిలోని వారందరూ సుష్ఠుగా భోజనాలు ముగించారు.

శ్రేష్ఠి ప్రాసాదం పై అంతస్తులో సుఖంగా హంసతూలికాశయ్యకానుకుని కూర్చుని ఆ బిచ్చగత్తెవైపే పలవోకగా చూచాడు.

ద్వారపాలకుడు ఆమెవైపు గుడ్లురిమిచూచి మళ్ళీ గట్టిగా కసిరాడు. తిరిగి ఆమె అతన్ని బతిమాలుకుంది :

"మా ప్రాణాలకీ మాయదారి కాటకం దాపరించడంమూలాన మే మిలా పట్టెడన్నంకోసం పాకులాడవలసిన అవసపట్టింది బాబూ! లేకపోతే మే మింతగా ప్రాధేయపడతామా? మే మెప్పుడైనా

మీ గుమ్మంముందు నిలబడి ఇలా దేవురించామా?...పోనీ, ఈ పసివాళ్ళకైనా పట్టెడన్నం పెట్టించండి!''

పసివాళ్ళనిద్దరిని ముందుకు నెట్టి ద్వారపాలకుని వైపు జాలిగా చూసింది భిక్షుకి. దానితో అతడు తన అధికారానికి గట్టిదెబ్బ తగిలిందని అహంకరించాడు.

'ఇన్ని మాయలు చెప్పినా నామాట కెదురు తిరుగుతుందా నిర్భాగ్యురాలు !' అనుకుని ఆమె మీది మీదికి వెళ్ళి విరుచుకు పడ్డాడు :

''నీకు కాదూ చెప్పేది? పో! పో!''

భవంతి ద్వారం దభాలున మూసివేసి లోపలికి వెళ్ళిపోయాడా ద్వారపరిచారకుడు.

''పోనీలే! బాబూ! ఇంత మాత్రానికంత కోపమెందుకు నాయనా! వెళ్ళిపోతానులే!''

ఒక్క చిరునవ్వు నవ్వి ఆమె ఆ పసివాళ్ళ నిద్దరినీ వెంటబెట్టుకొని మిట్ట మధ్యాహ్నం మండుటెండలో మరి ఒక భవంతి ద్వారం దగ్గరికి వెళ్ళిపోయింది.

శ్రేష్ఠి భవంతి పై అంతస్తులో ఆపసోపాలు పడుతూ ఆమె చిరునవ్వునవ్విన తీరు తలుచుకుని కొంచెం మథనపడ్డాడు.

సామాన్యంగా యాచకులు మెడపట్టుకుని గెంటినా చూరుపట్టుకుని వేళ్ళాడతారు. ఒకపట్టాన మరి విడిచిపెట్టరు! ముష్టి వెయ్యకపోతే అనేకవిధాల శాపనార్థాలు పెట్టందే మరి అక్కడనించి కదలరు.

తత్ప్రాపి అవి గడ్డు కరువురోజులు. ఆ పిల్లలిద్దరూ ఆకలితో నకనక లాడుతున్నారు. అయినా ఆ బిచ్చకత్తె పరుషంగా పల్లెత్తు మాటయినా అనలేదు. పైగా లీలగా ఒక్క చిరునవ్వు నవ్వి అక్కడి నించి వెళ్ళిపోయింది.

ఆ ధోరణి చూచి 'ముష్టెత్తుకోవడం ఆమె కంతగా అలవడలే'దని శ్రేష్ఠి గ్రహించుకొన్నాడు. ఆమె వెళ్ళిపోయాక ఆ పసివాళ్ళిద్దరికి పట్టెడన్నం పెట్టించాలని అనుకోకపోలేదు. అంతలోనే పరిచారకుడు దభాలున ఆ భవంతి తలుపు మూసివెయ్యడము, ఆమె వెంటనే అక్కడినించి వెళ్ళిపోవడము జరిగిపోయాయి.

శ్రేష్ఠి ఉసూరుమని ఒక వేడి నిట్టూర్పు విడిచిపెట్టాడు:

"దేశంలో ద్వాదశవర్ష క్షామమే పట్టుకున్నట్టుంది. ఎంతమంది కని ముష్టి వెయ్యగలం! మేము మాత్రం సంసారులం కామా! ఇంతకీ ఎవరి ప్రారబ్ధాని కెవరు కర్తలు! అంతా ఆ పరమేశ్వరలీల!"

మనస్సులో ఒకమారు పరమేశ్వరధ్యానం చేసుకుని ఆ విధంగా సమాధాన పడ్డాడు శ్రేష్ఠి.

అయినా అతని మనస్సులో చూచాయగా కొంచెం కించ కలగక పోలేదు. సింహద్వార పాలకుణ్ణి పిలిచి నెమ్మదిగా అడిగాడు:

"ఇందాకా నీవు పంపించి వేసిన ఆ బిచ్చగత్తె నెక్కడో కొంచెం గిలగా చూచినట్టే ఉందే!"

"అవును బాబూ! ఆ అమ్మ ఈ మధ్యనే బిచ్చానికి బయలు దేరింది. పూర్వం మన పశువుల కొట్టంలో పనిచేసిన పెద్దగొల్ల కూతురు సుప్రియ. తెల్లారి లేచింది మొదలు ఊరంతా ముష్టివాళ్లే! ఎంతమంది కని ముష్టి వెయ్యగలం!"

"అవునుగాని ఆ పసివాళ్ళెవరు?"

"ఎవరో దిక్కు మొక్కు లేకుండా వీధులమ్మట తిరిగే పసివాళ్ళి నిద్దరిని వెంట బెట్టుకుని ముష్టికి బయలుదేరి ఉంటుంది. తనొక్కత్తే వస్తే ముష్టి వెయ్యరని భయమేమో!"

"పోనీ, పట్టెడన్నం పడవేయించలేక పోయావా? చేత్తో లేదంటే పోయేదిగా!"

"ఎంతమంది కని వెయ్యగలం బాబూ! తెల్లవారింది మొదలు పొద్దస్తమానమూ ఒకటే కాకిగోల!"

"నిజమే మరి! పైగా ఈ ఏడాది ఈ వల్లమాలిన కరువొకటి వచ్చిపడింది! ఎంతమందికని వెయ్యగలం!"

అంటీ అంటనట్టుగా నిట్టూర్చాడు శ్రేష్ఠి. అప్పటికి తన మీద విరుచుకు పడబోయే నింద తప్పిపోయిందిగదా అని చల్లచల్లగా అక్కడి నించి జారుకున్నాడు పరిచారకుడు. శ్రేష్ఠి మళ్ళీ నిట్టూర్చాడు.

రత్నవర్ధనుడు శ్రావస్తీనగరంలో అంతటా బాగా పేరుమోసిన పెద్ద శ్రేష్ఠి. రత్నవ్యాపారంలో రెండుచేతులా డబ్బు గడించాడు. కలిగిన నలుగురు కొడుకులూ చేతికందివచ్చి అతనికి చేదోడు వాదోడుగా ఉన్నారు. భవంతి అంతా మనమలతోను, మునిమనమలతోను కలకల లాడుతూంది. శ్రేష్ఠి అన్నివిధాలా అదృష్టవంతుడే! ఆతని కేలోటూ లేదు. కాని, పాపం, అతని కెప్పుడూ సుఖమనేది లేదు. ఎప్పుడూ ఏదో ఒక బెంగ, దిగులు పట్టుకుని పీడిస్తూంటాయి.

ఆ నలుగురు కుమారుల్నీ తనంతటి గొప్పవారిని చెయ్యాలని అతని కొక తహతహ. ఇంతా కష్టపడి ఆర్జించిన ఈ ఐశ్వర్యం అంతా ఏక్షణంలో ఏమైపోతుందో అని ఇంకొక బెంగ! పైగా ఆ కరువు రోజుల్లో శ్రావస్తీ నగరపరిసరాల్లో బందిపోటుదొంగలు కొందరు విచ్చల విడిగా తిరుగుతున్నారని ఒక వదంతి వ్యాపించింది. అది విన్నప్పటినించి అతని కింక నిద్రపట్టడమే గగనమైపోయింది. ఒక వేళ తెల్లతెల్లవారే వేళ కొంచెం కోడి కునుకు పట్టినా బందిపోటు దొంగలు భవంతిలో పడి తన రత్నాలన్నీ దోచుకుపోతున్నట్లే కలవచ్చేది! గడిచిన రాత్రి అంతా అతని కొక్క కునుకు పట్టలేదు.

ఆ దిగులుతో లేనిపోని ఆపద లేవో ఆలోచిస్తూ సతమతమై పోతున్న శ్రేష్ఠికి సుప్రియ పెదవులపై మెరిసిన చిరునవ్వు అతి విచిత్రంగా స్ఫురించింది.

"ఇంత ఉన్నవాళ్ళకే ఈ దిగుళ్ళన్నీని! లేనివాళ్ళలాంటి వాళ్ళ నైనా చూచి హేళనగా నవ్వుకుంటారు! వాళ్లకేం!"

అలా ఏవేవో ఆలోచిస్తూ ఏదో మథనలోపడ్డాడు శ్రేష్ఠి. ఆ చింతాభారంలో అతని కెలాగో అలాగ ఒక చిన్న కునుకు పట్టింది.

2

మిట్టమధ్యాహ్నం దాటింది. సుప్రియ పసివాళ్ళిద్దరినీ వెంట బెట్టుకొని తన కుటీరానికి తిరిగివచ్చింది.

అది శ్రావస్తీనగర పరిసరంలో ఒక పెద్ద మర్రినీడలో కట్టిన కుటీరం. సుప్రియ ఆ కుటీరంలో ప్రవేశిస్తూనే తండ్రికీ, పసివాళ్ళకూ

ఇంత అన్నం పెట్టి మిగిలిందేదో తాను తిని మర్రినీడలో రాలిన పండుటాకులలో మేనువాల్చి హాయిగా నిద్రపోయింది. ఆమె తండ్రి అంతకు పూర్వమే కుటీరంలో ఒకమూల కునికిపాట్లు పడుతూ కూర్చున్నాడు. పనివాళ్ళిద్దరూ మర్రినీడల్లో నెమరులు వేస్తున్న మేకపిల్లలతో చెలగాటాలాడడం మొదలుపెట్టారు.

తండ్రికి సుప్రియ ఒక్కత్తే కూతురు. అతడంతకు పూర్వం రత్నవర్ధనుని గోష్ఠంలో పని చేస్తూ, తనకున్న చిన్నకొండ్ర కాస్త దున్నుకుంటూ కాలక్షేపం చేసేవాడు. క్రమంగా పెద్దతనం పైబడినకొద్దీ అతనికా కొట్టంలో పనిచెయ్యడం బాగా బరువనిపించింది. కొంతకాలం నించి ఆ పని మానేసి తనకున్న కొండ్ర దున్నుకుంటూ కాలక్షేపం చేశాడు. కాని అనావృష్టితో ఆ కొండ్రి కూడా బీడుపడిపోయింది.

ఇక గత్యంతరం లేక తత్త్వాలు పాడుకుంటూ శ్రావస్తీ నగర వీధుల్లో యాయవారం ప్రారంభించాడు. మండు వేసగి చండ్రి నిప్పులు చెరగడం ప్రారంభించేసరి కతని శరీరంలో మిగిలిన జవసత్త్వాలన్నీ ఉడిగిపోయాయి. క్రమక్రమంగా కాలు కదపలేని స్థితిగూడా ఏర్పడింది. ఆ పరిస్థితులలో ఇక సుప్రియ ఒక్కత్తే అతనికండగా నిలిచింది.

ఆమె కప్పటికి పద్ధెనిమిదేళ్ళు నిండాయి. ఆ పిల్ల నొక అయ్య చేతిలో పెట్టి సుఖంగా ఇహలోకయాత్ర చాలించాలని తండ్రి సంకల్పం. కాని ఆ ఏటి కాటకంవల్ల అతని కా పూట గడవడమే గగనమై పోయింది. పెళ్ళిమాట తలపెట్టడానికిక వ్యవధి ఎక్కడిది? అతడు మంచం పట్టడానికదికూడా ఒక కారణమే.

కాని చిన్నప్పటి నించీ సుప్రియ కా చింతలేవీ పట్టనేలేదు. తల్లి ఆమెకు బాగా చిన్నతనంలోనే ఇహలోకయాత్ర చాలించింది. అప్పటి నించీ తండ్రే ఆమె నల్లారుముద్దుగా పెంచి పెద్దదాన్ని చేశాడు.

సుప్రియ ఎప్పుడూ కలకలలాడుతూ నవ్వుతూ పేలుతూ ఉంటుంది. ఎప్పుడైనా ఒకప్పుడైశ్వర్య భోగభాగ్యాలు చవి చూచిన వారికి తమ భవిష్యత్తును గురించిన మథన బయలుదేరడం సహజం. నిత్య దరిద్రుల కటువంటి చింతకే ఆస్కారంలేదు. వా రొక విధమైన కష్టభూయిష్ఠ

జీవితాల కలవడతారు. అందుచేత ఉన్నంతలోనే కొంత తృప్తిపడడం వారి కలవడుతుంది. భవిష్యత్తులో ఎదుర్కోబోయే ఆపదల భీతివల్ల వారికి వర్తమానమే సుఖంగా ఉన్నట్టు స్ఫురిస్తుంది.

నిత్య సంతోషిత్వము, ఇరుగు పొరుగుల మీద ఒకింత జాలి సుప్రియకు సహజంగా అలవడ్డాయి. శ్రావస్తీ నగరంలోను, ఆ పరిసరాలలోను క్షామదేవత వికట తాండవం విజృంభించినా ఆమె ఎన్నడూ చెంగటిల్లి పోలేదు.

ఒకనా డామె భిక్షాటనానికి వెళ్ళి తిరిగి వస్తూంటే మధ్యే మార్గంలో దిక్కూ మొక్కూ లేని ఇరువు రనాథ బాలకులు తటసపడ్డారు. వారిని చూడగానే ఆమె ఎంతో ఆప్యాయంగా తనతో కూడా తోడుకు పోయింది. కన్న తల్లిలా కాపాడింది. తనకు దొరికినంతలో కొంత తండ్రికి, ఆ పసివారికి పెట్టి, మిగిలినదానితోనే తాను తృప్తిపడింది.

శ్రావస్తిలో ఆనాటి కానాటికి కరువెక్కువై పట్టణ పరిసరాలన్నీ శ్మశాన ప్రాయంగా మారిపోయాయి. అయినా సుప్రియ గుండెధైర్యం కోలుపోలేదు. భిక్షుకుల ముఖాలలో దరిద్రదేవత నిత్యమూ తాండవిస్తూంటూంది. కొంచెం పెట్టి పుట్టినవారు వారిని చూస్తూ చూస్తూనే దూర దూరంగా తొలగి పోవడానికిదీ ఒక కారణమే! సుప్రియ ముఖ మెప్పుడూ చిరునవ్వులు చిలకరిస్తూండడంవల్ల ఏదో విధంగా ఆమెకు కొంచెం భిక్షాన్నం దొరికేది. అసలు పే రేమయినా, నిత్యమూ కళ కలలాడుతూండడంవల్లనే ఆమెకు సుప్రియ అనే పేరేర్పడింది. క్రమక్రమంగా అదే ఆమె పేరుగా స్థిరపడింది.

వేసవి బాగా విజృంభించిన కొద్దీ శ్రావస్తిలో అన్నాతురుల హాహాకారాలెక్కువైనాయి. ఆ మండుటెండ ధాటికి తాళలేక చెట్ల మీది పక్షులలాగే ఎండుటాకుల్లా నేలమీద రాలి పడ్డాయి.

ఆ భీకర క్షామంలో బంధుప్రేమ కూడా విడిచి అందరూ ఆత్మ ప్రాణ సంరక్షణ తాపత్రయంలో పడ్డారు.

ఇక ఆ సమయంలో దిక్కూ మొక్కూ లేని దీనుల మాట పట్టించుకునే వా రెవరుంటారు!

శ్రావస్తిలో కొందరు శ్రీమంతులూ, ధర్మాత్ములూ కలిసి కొంత కాలంవరకూ అన్నార్తుల హాహాకారాలు తగ్గించారు. కాని క్షామ పీడ తగ్గే సూచన లేవీ కనిపించలేదు. ఆకలిబాధ కోర్వలేక కొందరు ప్రాణాలరచేత పట్టుకొని దేశాంతరాలు వెళ్ళిపోయారు. మరి కొందరు మధ్యే మార్గంలోనే ప్రాణాలు విడిచారు. మిగిలినవారు జీవచ్ఛవాలుగా జీవించారు. క్రమక్రమంగా ఆ దుర్భర క్షామపీడ ఇరుగుపొరుగు రాజ్యాలకు కూడా పాకింది.

ఆ విషమ ఘట్టంలో ప్రాణాలరచేత పెట్టుకొని క్షణ మొక యుగంగా గడుపుతున్న నగర పౌరుల కొక చల్లనివార్త చెవిని పడింది. శాక్యసింహుడు- గౌతమబుద్ధుడు శిష్య సమేతంగా శ్రావస్తికి విచ్చేయు నున్నాడన్న వార్త చల్లని జల్లులా పట్టణం అంతటా వ్యాపించింది.

ఆమహామహుని పాదధూళి సోకినంతనే శ్రావస్తిలో సకలారిష్టాలూ వాటంతట అవే తొలగిపోగలవని కొంద రెంతో సంతోషించారు. మరి కొందరు 'దైవకృతాని కెంతటివారయితే మాత్రం ఏమి చెయ్యగలరు!' అని చప్పరించేశారు.

3

ఆనోటా ఆనోటా వ్యాపించిన బుద్ధదేవుని ఆ ఆగమన వార్త వినగానే సుప్రియ ముఖంలో ఒక్కమారుగా వేయి చిరునవ్వులు విరిశాయి.

అంతవరకూ ఆమె కా మహాపురుషుని పేరుమాత్రమే చెవినపడింది. అంతేగాని సందర్శనభాగ్యం ఎన్నడూ లభించలేదు. శ్రావస్తీ నగరంలో గౌతముని రాకను గురించిన వింత వింత గాథ లెన్నో వ్యాపించాయి. చివరి కొకనాడు గౌతముడు శ్రావస్తి కనతిదూరంలో ఉన్న పంచవటీ చ్ఛాయలో విడిదిచేశాడన్న వార్త సుప్రియ చెవిని పడింది.

ఆనాటి సాయంకాలం శ్రావస్తి శ్రావస్తి అంతా పంచవటివైపు నడిచిపోతున్నట్లే కనిపించింది. రాజులూ, రాజబంధువులూ రథాల మీదా, గజాందోళికాది వాహనాలమీదా తథాగతుని సందర్శనభాగ్యం

పొందాలనే తహతహతో తొందర తొందరగా వెళ్ళిపోతున్నారు. కొందరా మహావ్యక్తి కర్పించాలని చిత్రవిచిత్రమైన కానుక లెన్నో తీసుకుపోతున్నారు. వాహన భాగ్యం లేని సామాన్యజనం కేవలం కాలినడకనే సాగిపోతున్నది.

వారందరినీ చూస్తూంటే సుప్రియ తానుకూడా బుద్ధుని సందర్శన భాగ్యం పొందాలని ఎంతో ఉబలాటపడింది. తనతోబాటెలాగైనా తండ్రినికూడా తీసుకుపోవాలని ప్రయత్నించింది. కాని రుగ్మతవల్ల అది కొనసాగలేదు.

ఇక మిగిలినవారు పసిపిల్లలు. సుప్రియ వారిద్దరికీ ఆ మాట చెప్పింది. పిల్లలిద్దరూ ఏదో ఉత్సవం చూడబోతున్నామనే ఉత్సాహంతో ఎగిరి గంతేశారు.

సుప్రియ ఎంతో కష్టపడి ఎక్కడో ఒక పోకదొన్నె సంపాదించింది. దానినిండా మేకపాలు పిండి దానిమీద లేత లేత మ్రాకొకటి మూతవేసింది. ఆ దొన్నె ఎంతో జాగ్రత్తగా చేతోపట్టుకుని నెమ్మది నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ పంచవటివైపు బయలుదేరింది. ఆ పసిపిల్లలిద్దరూ ఆమె అడుగులలో అడుగులు వేసుకుంటూ వెంట వెంటనే నడిచివెళ్ళారు.

దారిలో సుప్రియ కొకటే మథన! తానిచ్చిన ఆమేకపాలాయన ఆప్యాయంగా స్వీకరిస్తాడా? అసలా జనసమ్మర్దంలో తానాయన పాదసన్నిధికి చేరుకోగలదా?

అసలు నిరుత్సాహపడడమనేది ఆమె కలవాటేలేదు. గుండె ధైర్యం చిక్కబట్టి అలాగే మున్ముందుకు సాగిపోయింది.

సుప్రియ కెదురుగా జనం తండోపతండాలుగా మూగి ఒకరొకరిని తోసుకుంటున్నారు. ఆమె కిక అడుగే పడలేదు! ఆ పిల్లలిద్దరినీ వెంటబెట్టుకొని ఆయన నొక్కమారు సందర్శించడ మెలాగ? ఉత్కంఠతో సుప్రియకు కళ్ళమ్మట నీళ్ళపర్యంతం అయింది.

అప్పటికి సూర్యాస్తమానం అయింది. సందర్శనానికి వచ్చిన వారంతా మళ్ళీ తిరుగుముఖాలు పట్టారు. క్రమక్రమంగా జనం పలచబడ్డారు.

కొంచెం చీకటి పడింది. నల్లనల్లని మర్రినీడలో పండువెన్నెల పాలవెల్లువలా ప్రవహించింది. అప్పుడు బుద్ధదేవుని చుట్టూ పరివేష్టించి కూర్చున్నవారంతా చాలావరకు పలచబడిపోయారు. అంతా కలిసి రెండు మూడు వందల మందికంటె ఎక్కువ ఉండరు.

అంతవరకూ ఎక్కడో ఒక మారుమూల నిలుచున్న సుప్రియ పసివారి నిద్దరినీ వెంటబెట్టుకొని నెమ్మదిగా బుద్ధదేవుని సమీపానికి వెళ్ళి సాష్టాంగ నమస్కారం చేసింది. పసివారిద్దరి చేతా సాష్టాంగ నమస్కారాలు చేయించింది. తానెంతో భద్రంగా పోక దొన్నెలలో సేకరించిన మేకపాలెంతో భక్తిగా ఆయన పాదాలమ్రోల సమర్పించింది.

గౌతమబుద్ధుడవి స్వీకరించినట్లుగా కొంచెం తల పంకించి చిన్న చిరునవ్వు మెరిపించాడు. సుప్రియ కంతటితో పూర్తిగా సంతృప్తి కలిగింది. బుద్ధదేవుని పాదాల కనతిదూరంగా కూర్చుని నిశ్చలదృష్టితో ఆ తేజోమూర్తి వైపే చూచింది. ఆక్షణంలో ఆమె హృదయంలోని సంతోష సాగరతరంగా లానందబాష్పాలలో వెల్లువలై ప్రవహించాయి.

సుప్రియ బుద్ధదేవుని కెదురుగా కూర్చున్న పౌరవర్యుల నందరిని పరిశీలించి చూచింది. వారిలో చాలా మంది ఆమెకు చిరపరిచితులే! మొట్టమొదటగా రత్నవర్ధన శ్రేష్ఠి ముఖం ప్రత్యక్షమయింది. ఇంకా కొంచెం దూరంలో శ్రావస్తిలో గొప్ప కృషీవలస్వామిగా ప్రసిద్ధికెక్కిన క్షీరస్వామి ప్రత్యక్ష మయ్యాడు. ఆటుపిమ్మట బుద్ధదేవుని కెదురుగా శ్రావస్తీ నగర దండనాయకుడు చండసేనుని ముఖం కనిపించింది. ఇంకా సుప్రియ గుర్తెరిగిన శ్రావస్తీనగర పౌరులెందరెందరో తలవని తలంపుగా అక్కడ ప్రత్యక్షమయ్యారు.

ఏదైనా ధర్మ ప్రసంగం ఉపక్రమించే ముందొక అరగడియ వరకూ గౌతమ బుద్ధుడు కేవలం మౌనమే అవలంబించడం ఒకపరిపాటి. ఆ విషయం శ్రావస్తీవాసులందరూ అంతకు పూర్వమే విన్నారు. అందుచేత సదస్యులంతా తథాగతుని ధర్మ ప్రసంగాని కెదురుచూస్తూ నిశ్చల దృష్టులతో బుద్ధదేవుని పెదవుల కదలిక నిరీక్షిస్తూ కూర్చున్నారు.

అంతవరకూ ఆకల్లాడని మర్రికొమ్మల్లో పక్షుల కలకల రవాలప్పు డప్పుడే మేల్కొన్నాయి. పాలవెన్నెల చల్లని ప్రవాహంలో ఆ పరిసరమంతా అపూర్వానంద డోలికలలో ఓలలాడింది.

ఆ క్షణంలో సదస్యుల హృదయాలలో జీవుల జననమరణాలను గురించి, దైనందిన ధర్మాధర్మాలను గురించి, చిత్రవిచిత్రమయిన స్వర్గాది లోకాలను గురించీ ఎన్నెన్నో జిజ్ఞాస లావిర్భవించాయి. గౌతమబుద్ధు డందరి ముఖాలూ ఒకక్షణం సేపతినిశితంగా పరిశీలించాడు.

4

ఇంకొక క్షణంలో గౌతమబుద్ధుని పెదవు లలవోకగా విడివడ్డాయి:

"నాయనలారా! నా కీవేళ శ్రావస్తిలో అంతటా అన్నార్తుల హాహాకారాలే వినిపిస్తున్నాయి!"

గౌతమబుద్ధుని పెదవులనుండి ఒక వేడి నిట్టూర్పు వెలువడింది. సదస్యులందరూ శ్రావస్తివైపు దృష్టులుసారించి చెవులురిక్కించి శ్రద్ధగా విన్నారు. కాని వారికి శ్రావస్తిలో అన్నార్తుల హాహాకారా లేవీ వినిపించ లేదు. మరి గౌతమబుద్ధదేవుని కెలా వినిపించాయి! ఆయన కేదో దివ్య దృష్టి ఉన్న దేమోనని వారంతా ఎంతో ఆశ్చర్యపడ్డారు! తిరిగి గౌతమ ముని గభీరవాణి మారుమోగింది:

"మీరంతా వారందరికీ పట్టెడన్నం పెట్టించే మార్గమేదైనా ఆలోచించండి! పాపం! ఎంతమంది క్షుధార్తు లాకలిబాధకోర్వలేక అల్లల్లాడి పోతున్నారో! నాయనలారా! ఈ విషయమేమైనా ఆలోచించారా!"

సదస్యులలో శ్రద్ధాళువుల నేకులు గౌతమదేవుని పాదధూళి సోక గానే శ్రావస్తిలో వ్యాపించిన క్షామపీడ అంతా ఒక్కక్షణంలో హరించుకు పోగలదని అనుకున్నారు!

అసలా విషయమే తలపెట్టని శ్రీమంతులు కొంద రామహాత్ముని ముఖతః ధర్మసూక్ష్మాలేవో తనివి తీరా విని తరించాలని నిరీక్షిస్తూ కూర్చున్నారు.

అంతేగాని అక్కడ కూర్చున్నవా రెవరికీ అంతవరకూ ఆ జిజ్ఞాసే బయలుదేరలేదు! అందుచేత వారెవరికీ ఆ ప్రశ్న కేమని సమాధానం చెప్పాలో తెలియలేదు. అందరూ ఒకరొకరి ముఖాలకేసి చూస్తూ కూచున్నారు. అంతలో బుద్ధదేవుని గభీరవాణి ప్రతిధ్వనించింది:

"నే నింత దూరంనుంచి ఇక్కడికి వచ్చినది ప్రత్యేకం దీని కోసమే!"

తిరిగి ఆ కరుణామూర్తి పెదవులనుండి ఇంకొక వేడి నిట్టూర్పు వెలువడింది. కొంతమంది శ్రీమంతులిక ఆనాడు తమ తత్త్వజిజ్ఞాసలు తెలుపుడు చేసుకునే అవకాశమే లేదని చల్లచల్లగా తమ భవంతులకు జారుకున్నారు.

మరి కొంతమంది సభామధ్యంలోనించి లేచి వెళ్ళడానికి వీలు లేక, మరి గత్యంతరం లేక, ఆవలిస్తూ, చిటికెలు వేస్తూ అలాగే కూర్చుండి పోయారు.

రత్నవరను డా సభామధ్యంలోనే కూర్చున్నాడు. అతనికి ఎటుపోవడానికీ దారి కనబడలేదు. అంతలో గౌతమముని దృష్టి అతనిపై పడింది. శ్రేష్ఠి కొంచెం తలవంచుకొని తన గోడు వెళ్ళబోసు కున్నాడు. అతగాడు లెక్కలు కట్టడంలో గట్టిదిట్ట.

"ఈ విషయం నేను కొంచెం సావధానంగానే ఆలోచించాను. మన మహానగరంలో అనావృష్టి దోషంవల్ల అయిదారు వేల మందిదాకా అగతికులయినారు. కాటకం కాస్త మళ్ళు ముఖం పట్టేదాకా వీరంద రికీ ఇంత అన్నంపెట్టి, ఆదరించాలంటే అధమం పూట కొక వంద గుండిగల అన్నమైనా వార్చాలి!

"ప్రస్తుతం నా ధాన్యాగారంలో ఉన్నధాన్యం వీరందరికీ ఒక్క పూట పట్టెడన్నం పెట్టించడానికి కూడా చాలదేమో నని భయపడు తున్నాను."

శ్రేష్ఠి ఆపైన వంచిన తల మరి పైకెత్తలేదు! ఆపైన సదస్యు లందరి చూపులూ క్షీరస్వామిమీద పడ్డాయి. అతడు తన బుజంమీద ఉత్తరీయం ఒకమారు సవరించుకొన్నాడు:

"ఒక్క చుక్కైనా వర్షం పడక ఈ ఏడాది నా పొలాలన్నీ వట్టి బీళ్ళుగా మారిపోయాయి. నా పురులలో ఉన్న ధాన్యం అంతా కలిపితే ఈ ఏటి కేడాదీ మా కుటుంబ గ్రాసానికే సరిపోదేమోనని భయపడుతున్నాను. నాకున్న బలగం మీ కందరికీ తెలిసిందే గదా! ఏమైనా ఇంకో నాలుగు గింజలు మిగిలితే అవి విత్తనాలకైనా పనికి వస్తాయని అట్టే పెట్టించాను. నా దగ్గర మిగిలిన ధాన్యం అంతా అంతే! ఆపైన తమరందరూ ఎలా సెలవిస్తే అలాగే చేస్తాను! సెలవియ్యండి!"

ఇంకా అత డలాగే ఏదో ఘోష ప్రారంభించబోయాడు.

అంతలో చండసేనుడు తన ఒరలోని బాకు పైకిలాగి సగర్వంగా లేచినిలబడ్డాడు:

"నే నీ క్షణంలో నా సైన్యాలను, ఈ అస్త్రాలను వెంట బెట్టుకుని పరరాజన్యుల రాజ్యాలమీదికి దండెత్తిపోతాను! శత్రువు లందరినీ క్షణంలో సంహరించివేస్తాను! పదివారాలలో ప్రజలందరికీ పదిసంవత్సరాల వరకూ సరిపోయే ధాన్యరాసులు తరలించుకొని వస్తాను! సెలవిప్పించండి! వెంటనే బయలుదేరి వెళ్ళిపోతాను!"

అతని మాటలు విన్న సదస్యులందరికీ ముచ్చెమటలు పోశాయి. కాని ప్రస్తుతం అంతకంటే గత్యంతర మేమీలేదని వారిలో చాలామంది నిశ్చయించారు! కొందరు వెనువెంటనే సాధువాదాలు చేశారు! అంతలో గౌతమముని పెదవులు విడివడ్డాయి:

"నాయనా! నీవువెళ్ళి తిరిగివచ్చేవరకూ శ్రావస్తిలోని అస్త్రాలు లందరూ మల మల మాడిపోవలసిందేనా! కొంచెం శాంతించి సావధానంగా ఆలోచించుకో!"

చండసేనుని కిక ఏమనాలో తెలియలేదు. అత డలాగే దిగాలు పడి ముచ్చెమటలు కక్కుతూ కూర్చున్నాడు.

గౌతమముని మరికొంత సేపటివరకూ మౌనముద్ర వహించి కూర్చున్నాడు. ఎంతసేపటికీ ఎవరూ ఇంకొక మార్గం చూపించలేక పోయారు.

గౌతము డుసూరుమని నిట్టూర్చి లేచి నిలుచున్నాడు. ఇక ఆయన అక్కడినుంచి బయలుదేరి వెళ్ళిపోయేవేళ సమీపించిందనీ, ఇక ఆ మహాపురుషుడు తమ నగరంలో ఒక్కక్షణమైనా నిలవడనీ, ఆయనకిక తమ మీద దయతప్పిందనీ అందరూ భయపడ్డారు !

అంతలో సుప్రియ తన చిన్నిజోలె ఆ కరుణామూర్తి ముందుంచి జాలి తొణికిసలాడే గద్గదస్వరంతో విన్నవించింది:

"మహాప్రభూ! మాలాంటి అన్నార్తు లందరినీ ఇలా వదలి వెళ్లి పోవడం తమకు ధర్మంకాదు! ఒక్కక్షణం ఆగండి!

"ఇక్కడ కూర్చున్నవారందరూ ఇంతో అంతో ఉన్నవారే! నాకొక్కతెకు మాత్రం ఏమీ లేదు! కాని ఈ చిన్నజోలె, ఈపసివాళ్లు చల్లగా ఉంటే నేనీ అన్నం లేనివారి నందరినీ ఎన్నాళ్లయినా పోషించగలను!"

కొందరామెమాటలు విని నిర్ఘాంతపోయారు! మరికొందరామెకు మతిభ్రమణమే కలిగిందని అనుకొన్నారు. అంతలో సుప్రియ మళ్ళీ విన్నవించింది:

"మీ దయ ఉంటే వీళ్లందరి ధాన్యాగారాలలోని ధాన్యము నాదన్నమాటే! నేను జోలె చేతబుచ్చుకని బయలుదేరితే నాకందరూ తలోదోసెడు బియ్యం పెట్టకపోరని గట్టి ధైర్యమే ఉంది. మీచల్లని చూపు కొంచెం నామీద పడితే నేనెంతమంది నయినా, ఎన్నాళ్ళయినా పోషించగలను! మామీద తమకింత దయకలిగితే ఈ కరువు కాటకాలొకలెక్కా?"

కరుణార్ద్రమయిన సుప్రియ అమృతవాణి విన్న సదస్యులందరి శిరస్సులూ ఒక్కమారుగా కిందికి వంగిపోయాయి.

ఆనందాశ్చర్య విస్ఫారితమైన గౌతముని దృష్టి లీలగా సుప్రియ మీదికి ప్రసరించింది.

"తల్లీ! నీ వింతటి భాగ్యశాలినివని అనుకోలేదు సుమా! నీవంటి వారొక్కరుంటే చాలు! ఈ శ్రావస్తి కేమిలోటు?

"రా! నేనుకూడా నీవెంట వస్తున్నాను! రా!"

గౌతమబుద్ధుడు లేచి నిలుచుని ఎంతో ఆప్యాయంగా ఆమె శిరస్సు నిమిరాడు. నగరవాసు లాక్షణంనించీ తమ ఇళ్ళలో దాచుకొన్న ధాన్యరాసులన్నీ సుప్రియ కెదురుగా కుప్పలుగా పోశారు.

ఆనాటి శ్రావస్తీ నగరంలోనూ, నగర పరిసరాలలోనూ ముందుగా శాక్యసింహుని అపార కరుణామృత వృష్టి కురిసింది.

ఆ పైన తొలకరి నీలమేఘా లొక్కుమ్మడిగా కుంభవృష్టి కురిపించాయి!